క్లుప్తంగా

నేడు డైమండ్ టవర్స్‌లో నృసింహుని కల్యాణం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని మామిళ్లగూడెం రామాలయం రోడ్డు డైమండ్ టవర్స్‌లో మంగళవారం శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పర్సా వెంకటలక్ష్మీ నరసింహారావు, కొండపల్లి, భార్గవ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు కాసులనాటి సుందర రామయ్య, సాంబశివరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయండి

తిరుమలాయపాలెం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మం రూరల్ మండలం సత్యనారాయణపురంలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో నిర్వహించి నియోజకవర్గ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేయాలని నాయకులు చావా శివరామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు తీన్మార్ మల్లన్న హాజరవుతారని తెలిపారు.

వరిగడ్డి వామి దగ్ధం

కామేపల్లి: విద్యుత్ వైర్లు తెగిపడి వరిగడ్డి వామి దగ్ధమైన ఘటన మండలంలోని మద్దిగూడెంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బత్తుల సుమన్ పాడిపరిశ్రమ నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు రూ.లక్ష ఖర్చు చేసి ఎండు గడ్డి కొనుగోలు చేసి వామి వేశాడు. వామి సమీపంలో విద్యుత్ తీగలు తెగిపడటంతో గడ్డి వాముకు మంటలు అంటుకొని దగ్ధమైంది. ఫైరింజన్ వచ్చి మంటలు ఆర్పినా అప్పటికే వాము పూర్తిగా దగ్ధమైంది.

న్యాయవాది మృతికి సంతాపం

ఖమ్మం లీగల్: ఖమ్మం పట్టణం బ్రాహ్మణ బజార్‌కు చెందిన సీనియర్ న్యాయవాది ఎంవీ వరదాచారి అనారోగ్యంతో సోమవారం మరణించారు. ఈ మేరకు ఆయన మృతికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, కార్యదర్శి చింత నిప్పు వెంకట్, తెల్లాకుల రమేష్ బాబు సంతాపం తెలిపారు.

ఆలయ వార్షికోత్సవం



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

కామేపల్లి: కామేపల్లి గ్రామంలో కొలువుదీరిన ముత్యాలమ్మ దేవాలయం పదో వార్షికోత్సవ వేడుకలను సోమవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామం సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని గ్రామదేవతను భక్తిశ్రద్ధలతో వేడుకున్నారు. పూజారి సాంబశివరావు, నిర్వాహకులు మహంకాళి రామనర్సయ్య, గుప్తా హనుమంతరావు, కేసగాని నాగయ్య, తిరుపతిరావు, వెంకయ్య, రాము, గాదె సత్యం, రమేష్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ

రఘునాథపాలెం: మండలంలోని రేగులచలక ప్రధాన రోడ్డు పక్కన ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో చోరీ జరిగింది. అంగన్‌వాడీ ఆయా ఐసీడీఎస్ అధికారులతో కలిసి సోమవారం రఘునాథపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా కథనం ప్రకారం.. రోజులాగే ఆయా సోమవారం ఉదయం వచ్చే సరికి గేటు తాళం పగులగొట్టి గది తలుపులు తెరిచి లోపల ఉన్న గ్యాస్ సిలిండర్, ఇతర సామగ్రి చోరీ చేసినట్లు గుర్తించింది. ఆరు నెలలు కిందట కూడా చోరీ జరిగిందని, వరస చోరీలు జరుగుతుండటంతో కేంద్రంలో రక్షణ లేకుండా పోతోందని పేర్కొన్నారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	38	బచ్చలికూర	4
వంకాయ	40		20
బెండకాయ	30	పాలకూర	3
పచ్చిమిర్చి	80		20
కాకర	56	చుక్కకూర	3
బీర	50		20
దొండ	30	తోటకూర	4
పొట్లకాయ	40		20
చిక్కుడు	110	గోంగూర	4
గోరుచిక్కుడు	50		20
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	36	కొత్తిమీర	1
చామగడ్డ	50		30
క్యారెట్	46	పుదీన	1
క్యాప్సికం	70		20

-ఖమ్మం వ్యవసాయం

వామ్మో.. క్రాస్ రోడ్డు..

ప్రమాదాలకు నిలయంగా వరంగల్ క్రాస్‌రోడ్

- కరువైన స్పీడ్ బ్రేకర్లు
- మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు



ప్రమాదాలకు నిలయమైన వరంగల్ క్రాస్ రోడ్డులోని మలుపు

ఖమ్మంరూరల్: వరంగల్ క్రాస్‌రోడ్డు అంటేనే ప్రయాణికులు, వాహనదారులు హడలిపోతున్నారు. రూరల్ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలో డీబీఆర్ సర్కిల్ వద్ద అనునిత్యం ప్రమాదాలు చోటు చేసుకోవడంతో పలువురు మృతి చెందడం, మరికొంత మంది గాయపడటం పరిపాటిగా మారిపోయింది. ఖమ్మం నుంచి హైదరాబాద్, వరంగల్, కోదాడ వెళ్లడానికి, అదే విధంగా హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు ప్రతీ రోజూ వేలాది వాహనాలు వెళ్లడానికి ఇదే మార్గం కావడంతో వాహనాల రద్దీ బాగా పెరిగిపోయింది. వాహనదారులు కూడా జాగ్రత్తలు పాటించకపోవడం, ప్రమాదాలు జరిగే ప్రాంతంలో కనీసం హెచ్చరిక బోర్డులు, స్పీడ్ బ్రేకర్లు లేకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా ఈ సర్కిల్ కేరాఫ్ అడ్రస్‌గా మారింది.

తరచుగా ప్రమాదాలు..

గతంలో ఇక్కడ పలు ప్రమాదాలు జరిగి పదుల సంఖ్యలో వాహనదారులు బాటసారులు మృతి చెందారు. రెండేళ్ల క్రితం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐని లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం ఇద్దరు ద్విచక్ర వాహనదారులు కూడా మృతి చెందారు. గత నెలలో ఇదే ప్రాంతంలో ద్విచక్రవాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ద్విచక్రవాహనదారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఇలా రెండేళ్లలోనే ఐదుగురు మృత్యువాత పడటం గమనార్హం. నెల క్రితం బైక్‌ను లారీ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. తాజాగా ఆదివారం గత వారం క్రితం ద్విచక్రవాహనదారున్ని లారీ ఢీకొట్టడంతో ద్విచక్రవాహనదారునికి గాయాలయ్యాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టడం, ట్రాఫిక్ రూల్స్ పాటించేలా చూసి ప్రమాదాలకు చెక్ పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రమాదాలకు కారణాలివే..

వరంగల్ క్రాస్‌రోడ్డులోని డీబీఆర్ సర్కిల్ వద్ద బైపాస్‌రోడ్డు నుంచి వచ్చే వాహనాలు ఖమ్మం నుంచి హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు అతి దగ్గరకు వచ్చే వరకు కనిపించవు. తీరా ప్రమాదం ఉంటుందని ఊహించి వాహనాలను పక్కకు తిప్పే లోపే జరగాల్సిన అనర్థం జరిగిపోయి విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇదే పరిస్థితి రోడ్డుకిరువైపులా ఉండటంతో పలు ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి..

సర్కిల్ వద్ద పోలీస్ పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ప్రతీ ఒక్కరూ ఈప్రాంతంలో నెమ్మదిగా వెళ్లాలి. అందరూ ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. ఈవిషయమై వాహనదారులకు అవగాహన కల్పించడంతో పాటు రూల్స్ అతిక్రమించిన వారిపై జరిమానాలు విధించడం, అవసరమైతే కేసులు కూడా నమోదు చేస్తున్నాం.

– రాజిరెడ్డి, సీఐ, ఖమ్మంరూరల్

కాలువలన్నీ శుభ్రం చేయాలి

- మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి

ఖమ్మంమయూరిసెంటర్: మరో 20 రోజుల్లో వర్షాకాలం వస్తున్నందున కాలువలన్నీ శుభ్రం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి అన్నారు సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఎస్సై వారి డివిజన్‌లో ఎక్కడైతే నీరు ఆగుతుందో ఆ వివరాలను నమోదు చేయాలన్నారు. చెత్త పేరుకుపోయిన నీరు ఆగిపోతున్న ప్రాంతాలను గుర్తించి గ్యాంగ్‌వర్క్‌తో శుభ్రం చేసేవి, మిషన్‌తో శుభ్రం చేసేవి గుర్తించి డివిజన్ వారీగా లిస్ట్ ఇవ్వాలన్నారు. కాల్వల్లో చెత్త వేసే వారిని గుర్తించి వారికి జరిమానా విధించాలని చెప్పారు. ఖాళీ స్థలాల్లో చెత్త పేరుకుపోతే శుభ్రం చేయించాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ సంపత్, ఎస్సైలు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ పాల్గొన్నారు.

వర్షాకాలంలో ముందస్తు చర్యలు చేపట్టాలి

ఖమ్మంమయూరిసెంటర్: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలు ముందస్తు చర్యలు తీసుకోవాలని, అలాగే జాగ్రత్తలపై అధికారులకు నగర మేయర్ పునుకొల్లు నీరజ పలు సూచనలు చేశారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. నగరంలో ఖాళీ ప్రదేశాలను యజమానులు వారి సొంత ఖర్చులతో శుభ్రం చేయించుకోవాలని, ఇరుగు పొరుగు వారికి ఇబ్బంది కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు జరగకుండా నాలాలోని పేరుకుపోయిన గుర్రపుడెక్క చెత్తను తొలగించుటకు టెండర్లు పిలిచి పూడికతీత పనులను చేపట్టాలన్నారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోండి



మాట్లాడుతున్న హనుమంతరావు

ఖమ్మంరూరల్: పేదలు ఉచిత న్యాయం పొందేందుకు నేషనల్ లీగల్ సర్వీస్ సెల్ అథారిటీ తీసుకొచ్చిన ఉచిత న్యాయ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీ చీఫ్ లీగల్ ఏయిడ్ కౌన్సిల్ మామిడి హనుమంతరావు పిలుపునిచ్చారు. సోమవారం పెద్దతండాలో అసంఘటిత కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.. ఎస్సీ, ఎస్టీ ప్రజానికానికి నేషనల్ లీగల్ సెల్ అథారిటీ ఆధ్వర్యంలో అనార్గనైజ్డ్ వర్కర్స్ స్కీమ్ 2015 ద్వారా ఉచిత న్యాయ సేవలు అందించటం జరుగుతుందన్నారు. అసంఘటిత కార్మికులు ఉచిత న్యాయంతో పాటు హెల్త్ కార్డులను, ఇన్సూరెన్స్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ తొర్రికుంట శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ రవి, నాయకులు ఉపేందర్, కుమార్, శ్రీనివాసరావు, గురవయ్య, యూత్ లీడర్ గోపి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఖమ్మంఅర్బన్: నగరంలోని బల్లేపల్లి విద్యుత్ సెక్షన్ పరిధిలోని అంకమ్మగుడి ఫీడర్‌లైన్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఫీడర్ పరిధిలోని కైకొండాయిగూడెం, పాండురంగాపురం, ఖానాపురం పారిశ్రామిక ప్రాంతం తదితర ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఆర్‌ఎంపీలకు అండగా నిలవండి



గ్రామీణ వైద్యులతో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు అతి తక్కువ ఖర్చుతో 24 గంటలు అందుబాటులో ఉండి వైద్యం అందిస్తున్న తమపై ఎన్ఎంపీ, టీఎస్ఎంసీలు చేస్తున్న దాడులతో ఇబ్బందులు పడుతున్నామని, తమకు అండగా నిలవాలని గ్రామీణ వైద్యుల సమాఖ్య నాయకులు సోమవారం సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావును కలిశారు. ఈ సందర్భంగా నున్నా నాగేశ్వరరావు మాట్లాడుతూ... ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో మాట్లాడి అందరం కలిసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్దామన్నారు. వారి వెంట సీపీఎం ఉంటుందని, పరిమితికి మించి వైద్యం చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడకుండా ప్రాథమిక చికిత్స మాత్రమే ఇవ్వాలన్నారు.

సోమ్లానాయక్‌కు మెరుగైన చికిత్స అందించాలి

- వైద్యులకు మంత్రి పొంగులేటి ఆదేశాలు



పరామర్శిస్తున్న మంత్రి పొంగులేటి

హైదరాబాద్: ఇటీవల అస్వస్థతకు గురై హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు బాణోతు సోమ్లా నాయక్‌ను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం రాత్రి పరామర్శించారు. ఆయన మనవడు బాణోతు ఉత్తేజ్ నాయక్, కుటుంబ సభ్యులను అడిగి సోమ్లా ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

గొర్రెల పెంపకందారులను ఆదుకోవాలి

కామేపల్లి: నాలుగు రోజుల క్రితం కలుపుమందు కొట్టిన గడ్డి మేసి 200ల గొర్రెలు మృత్యువాత పడిన ఘటనలో తీవ్రంగా నష్టపోయిన గొర్రెల పెంపకందారులను ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని డీసీసీబీ డైరెక్టర్, అఖిల భారత యాదవ మహాసభ జిల్లా గౌరవాధ్యక్షుడు మేకల మల్లిబాబు యాదవ్ ప్రభుత్వాన్ని సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గొర్రెల కాపరులగా జీవనం వెళ్లబుచ్చుతున్న గొర్రెల కాపరుల కుటుంబాలను ఆదుకోవాలని పేర్కొన్నారు.

బీజేపీతోనే అన్ని వర్గాలకు న్యాయం



మాట్లాడుతున్న శ్రీనివాస్

నేలకొండపల్లి: బీజేపీని గెలిపిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని పార్టీ పాలేరు ఎన్నికల ఇన్‌చార్జ్ గరిమెల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు....ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ని గెలిపించాలని కోరారు. నిరుద్యోగులు, విద్యావంతులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కొరకు కృషి చేసే బీజేపీని గెలిపించాలని సూచించారు. కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను విస్మరించారన్నారు. బీజేపీతోనే అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో సంతోష్‌రెడ్డి, అనంతు ఉపేందర్ గౌడ్, కృష్ణారావు, పొగర్తి సుధాకర్, సూరేపల్లి జ్ఞానరత్నం, షర్ఫుద్దీన్, సయ్యద్ మోహినుద్దీన్, నరసింహారావు, హనుమంతరావు, రాధాకృష్ణ, రామకృష్ణ, మల్లిఖార్జున్ తదితరులు పాల్గొన్నారు.

పోరాడే వారిని చట్టసభలకు పంపండి



ప్రచారం నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

ఖమ్మంమామిళ్లగూడెం: ప్రజా సమస్యలపై పోరాటం చేసే వ్యక్తి, అవగాహన ఉన్న వ్యక్తినే చట్టసభలకు పంపాలని, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించడంతో సమస్యల పరిష్కారానికి దారి చూపినట్లు అవుతుందని బీజేపీ క్రమశిక్షణ సంఘం చైర్మన్, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు అన్నారు. సోమవారం నల్లగొండ, ఖమ్మం, వరంగల్ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని నగరంలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ స్టేడియంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గల్లా సత్యనారాయణతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రేమేందర్‌రెడ్డిని గెలిపించడంతో నిరుద్యోగుల తరపున ఉద్యోగుల తరపున ఒక ప్రశ్నించే గొంతును చట్టసభలకు పంపినట్టు అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల ఖమ్మం అసెంబ్లీ ఇన్‌చార్జి పెద్దోళ్ల గంగారెడ్డి, కపిలవాయి రవీందర్, ఎమ్మెల్సీ ఎన్నికల జిల్లా కోఆర్డినేటర్ దుద్దుకూరు వెంకటేశ్వరరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏడో డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్యామ్ రాథోడ్, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షులు చావా కిరణ్, అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాస్, నాయకులు ఆచంటి కోటేశ్వరరావు, సేవా భారతి జిల్లా అధ్యక్షుడు మోత్కూరు నారాయణరావు, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రుద్రగాని మాధవ్ నాయకులు పాల్గొన్నారు.

ప్రేమేందర్‌రెడ్డికి ఓటేయండి

బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపును కాంక్షిస్తూ ఖమ్మంలోని 334 పోలింగ్ బూత్‌లో గ్యాడ్యుయేట్ ఓటర్లను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటేసి గెలిపించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ రైల్వేబోర్డు మెంబర్ మట్టా దుర్గాప్రసాద్‌రెడ్డి, నాయకులు జ్వాలా నర్సింహరావు, చిరంజీవి, రావూరి వెంకటేశ్వర్లు, మాతంశెట్టి వెంకటరమణ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరంతో ఉపయోగం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న హార్వెస్ట్ విద్యాసంస్థల చైర్మన్ నాగమణి తదితరులు

ఖమ్మంసహకారనగర్: స్ప్రింగ్‌లీఫ్, టెండర్‌రూట్స్‌లో ఏర్పాటు చేసిన వేసవి శిబిరం చిన్నారులకు ఉపయోగాన్ని చేకూర్చిందని హార్వెస్ట్ గ్రూప్‌ఆఫ్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వై.నాగమణి అన్నారు. సోమవారం పార్క్ స్ట్రీట్‌లో వేసవి శిబిరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వేసవిలో పిల్లలు టీవీలకు, సెల్‌ఫోన్‌లకు తమ సమయాన్ని కేటాయించకుండా వారికి ఉపయోగపడే స్కేటింగ్, సంగీతం, చేతి రాత, డ్యాన్స్, పాటలు, ఈత తదితర విషయాలు చేర్చుకోవడం వల్ల భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. హార్వెస్ట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ ఆర్.పార్వతీరెడ్డి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు చదువుకు, ఆటపాటలకు దూరం కాకుండా స్విమ్మింగ్‌పూల్, స్కేటింగ్ రింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్ప్రింగ్‌లీఫ్ పాఠశాల సిబ్బంది, టెండర్‌రూట్స్ సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

'స్తంభాద్రి'లో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ఉత్సవాలు ప్రారంభిస్తున్న అర్చకులు



విద్యుద్దీపాల వెలుగులో నృసింహాలయం

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం నగరంలోని ప్రాచీన దేవస్థానం శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక పంచాహ్నిక బ్రహ్మోత్సవ శ్రీ సుదర్శన యాగ, కల్యాణ మహోత్సవాలు సోమవారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. సాంప్రదాయ పద్ధతిలో మంగళవాయిద్యాలతో సాయంకాలార్చనతో ఉత్సవాలను ప్రారంభించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాచరణ, అంకురార్పణ, అఖండ దీపారాధన, ధ్వజపట ప్రతిష్ఠ, విశేష పూజ, బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, తీర్థ ప్రసాదాల వితరణ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కొత్తూరు జగన్మోహన్ రావు పర్యవేక్షణలో ఆలయ అర్చకులు, పండితులు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

తిరుమలాయపాలెం : మండలంలోని పాతర్లపాడు శ్రీ యోగానంద లక్ష్మీనర్సింహస్వామి వారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలు ఈనెల 25 వరకు కొనసాగుతాయని ఆలయ అర్చకులు ప్రతాపురం రవీంద్రాచార్యులు తెలిపారు. 23న రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా సాగుతుందని, భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నిలువ నీడ లేకపాయె..!

- పాలేరు నియోజకవర్గ కేంద్రంలో జాడలేని బస్టాండ్ నిర్మాణం
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



ఎండలో బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

కూసుమంచి: పాలేరు నియోజకవర్గ కేంద్రమైన కూసుమంచిలో బస్టాండ్ లేకపోవటంతో ప్రయాణికులకు తిప్పలు తప్పడం లేదు. గతంలో పాలేరు నుంచి పలువురు మంత్రులుగా ఉన్న ఈ సమస్యను తీర్చలేకపోయారు. వానొచ్చినా, ఎండొచ్చినా ప్రయాణికులకు నిలువ నీడ లేకుండాపోతోంది. దీంతో కూసుమంచిలో బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిందే.

ఖమ్మం–సూర్యాపేట రాష్ట్రీయ రహదారి మండల కేంద్రం గుండా నిత్యం వందలాది వాహనాలు ఈ రహదారిగుండా రాకపోకలు సాగిస్తుంటాయి. మండల ప్రజలు, ఇతర ప్రాంతాల వారు నిత్యం పనుల నిమిత్తం రాకపోకలు సాగిస్తుంటారు. వారు బస్సులు ఎక్కేందుకు కూసుమంచి సెంటర్‌కు రావాల్సిందే. ఇదివరకు రోడ్డు పక్కన చెట్లు ఉంటే వాటి కింద ప్రయాణికులు నిలుచునేవారు. ఇటీవల రోడ్డు వెడల్పులో ఉన్న చెట్లను కాస్తా తొలగించారు. దీంతో ప్రయాణికులు రోడ్ల వెంట ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ప్రయాణికులు బస్సుల కోసం వేచి చూడాల్సివస్తుంది.

వేసవిలో నరకయాతన..

ఇక వేసవి కాలంలో ప్రయాణికులకు నరకయాతనే. రహదారి వెడల్పుతో చెట్లు తొలగించటంతోపాటు ఉన్న రహదారి పక్కన నిల్చునే వీలు లేకపోవటంతో ప్రయాణికుల తిప్పలు అన్నీ ఇన్నీ కావు. దీంతో బస్సులు వచ్చేంత వరకు వారు ఏదో ఒక దుకాణంవద్ద పడిగాపులు కాస్తూ వెళ్లాల్సి వస్తుంది. ఇక వర్షాకాలం బస్టాండ్ సెంటర్‌లో ప్రయాణికులు నిల్చునే వీలు లేక దుకాణాల్లోనే ఉండాల్సి వస్తుంది.

గతంలోనే ప్రతిపాదనలు..

మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మాణానికి గతంలో పాలేరు ఎమ్మెల్యేగా ఉన్న ప్రస్తుత మంత్రి తుమ్మల నాగేశ్వరరావు 2019 ఎన్నికల సమయంలో బస్టాండ్ ప్రతిపాదన చేశారు. కూసుమంచిలోని ఉన్నత పాఠశాల పాత భవనాల స్థలంలో బస్టాండ్‌ను నిర్మించాలని యోచించారు. ఈలోగా ఎన్నికలు రావటం, తుమ్మల నాగేశ్వరరావు ఓటమి చెందటంతో బస్టాండ్ కథ కంచికి చేరింది. దీంతో ప్రయాణికులకు తిప్పలు మామూలయ్యాయి. ఇప్పటికైనా ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవచూపి మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలని కోరుతున్నారు.

బస్టాండ్ నిర్మించాలి

మండల కేంద్రంలో బస్టాండ్ నిర్మించాలి. బస్టాండ్ లేక ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. గతంలోనే బస్టాండ్ నిర్మాణం అన్నారు కానీ దాని ఊసే లేదు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవ తీసుకుని బస్టాండ్ నిర్మాణం చేపట్టాలి. ప్రయాణికుల కష్టాలు తీర్చాలి

– ఎండీ యూసుఫ్, కూసుమంచి

బస్సులు వచ్చేంత వరకు తిప్పలే..

కూసుమంచి మండల కేంద్రంలో బస్టాండ్ లేకపోవటంతో బస్సులు వచ్చేంత వరకు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. మహిళలకు చాలా ఇబ్బందులు కలుగుతున్నాయి. చంటి పిల్లలు, వృద్ధులు బస్సులకు ఎండ తట్టుకోలేకపోతున్నారు. కనీసం బస్ షెల్టర్ కూడా లేదు..

– ఉపేందర్‌రెడ్డి, కూసుమంచి